# ఏమి రహస్యం నాకు చెప్పరూ

పంపు దగ్గర నీళ్ళు పట్టుకుని, బుజాన బిందె ఎత్తు కుంటూ ఎదురింటికేసి చూసింది వనజ. తలుపులు వేసి వున్నాయి. కానీ కిటికీ దగ్గర కూర్చుని ఇటే చూస్తున్న రెండుకళ్ళు కనబడ్డాయి. బిందె బరువుకి బుజం కలుక్కు మంటున్నది. అంచేత అట్టేసేపు అటుచూడక, లోపలికి వెళ్ళింది వనజ. మరో బిందె, మరో బక్కెట్టు అల్లా పట్టు కుంటూ మధ్య మధ్యలో కిటికీ వెనుకనున్న మనిషివంక చూడసాగింది.

తెల్లవారకుండా లేచినా ఇప్పటికింకా పనులు కాలేదు. ఇంట్లోవున్నవారు మరో ముగ్గురే అయినా, ముగ్గురూ మగ మహారాజులే. ఆయనా, ఇద్దరు కొడుకులున్నూ. వాళ్ళ లేవడం, పాలు, కాఫీలు సేవించడం, పేచీలు పడడం, జుట్టు పట్టుకోవడం ఇవే ఇంతవరకు సరిపోయాయి. ఆయన గారం టేనో ఒకనాడు బద్ధకా(గేసరుల్లా పడుకుంటే పడుకోవడమే, కూర్చుంటే కూర్చోవడమే. పేపరుచదివితే చదవడమే. ఇంక మరోనాడు చిచ్చుబుడ్డిలాగ హడావిడి చేస్తారు. వీటితోటే

టైము గడుస్తుంది. తీరుబాటుగాకూర్చుని వీధిలోకి చూడ్డానికి నాకు అసలు ఎన్నడైనా కుదురుతుందా ?

ఎదురింటి అమ్మాయికూడా వంటరిదికాదు. ఆమె, భర్త, ఒక కొడుకు. ఎంత పనిలేదనుకున్నా పంపులోంచి నీళ్ళు పడుతున్న కాస్సేపైనా ఆ జలపాతం ముందు జపం చేయవద్దా? వాళ్ళింటిలో నీళ్ళు బ్రహ్మాండంగా వస్తాయేమో. పనిదాన్ని అడగాలి. ఆయనగారు సూటు, బూటు వేసి షోగ్గానే వుంటాడు. ఐతేనేం ఇంట్లో పనులన్నీ చేస్తాడు కాబోలు. లేకపోతే ఇంత తీరుబాటు ఎల్లావుంటుంది?

ఇన్నివిధాల వనజ అనుకుంటూ బిందెలు, బకెట్లు నింపుతూ నిర్మొహమాటంగా కిటికీవేపే చూస్తోంది. అంత సేపూ కిటికీలోని ఆ వనిత అల్లా కూర్చునే వుంది. ఇది ప్రొద్దుటి ఘట్టం.

ఆడవాళ్ళు—అందునా భర్త, పిల్లలుగల యిల్లాలు మంచి పని టైములో కిటికీ దగ్గర కూర్చుని వీధుల్లో వచ్చి పోయే చోద్యాలు చూడ్డం అనేది చాలా గొప్ప చోద్యం.

మధ్యాహ్నం పూలవాడికేక వినబడింది. వనజ నిద్ర పోతున్నది కాస్తా, వాడు పోతాడేమోనని గబగబ తలుపు తీసుకుని గేటుదగ్గరకు వచ్చింది. ఎదురింటిదగ్గర వున్నాడు. ఆమె పూలు కొంటోంది— తెల్లని చీర, తెల్లజాకెట్టు, పైకి అందంగా చుట్టిన ముడి, ఎండలోని వేడినంతా చల్లగా నూరుస్తున్నట్లుంది ఆమె వేషం చూస్తోంటే. బూజుబారిన తన చీర,

మెడపైన, ముఖంపైన జిడ్డుగా అతుక్కున్న తనజుట్టు, తన ఆకారం చూసుకుంది వనజ. ఎదురుగా నిలబడ్డానికే సిగ్గేసి లోపలికి వెళ్ళింది. ఎదురింటామె ఇంట్లోకి వెళ్ళిందని చూశాక, తను బైటికివచ్చి పూలుకొన్నది. ఇది మధ్యాహ్నం ఘట్టం.

వేసవికాలం మధ్యాహ్నంపూట ఎంత అందమైన వాళ్ళయినా, జిడ్డు ముఖాలుగా తయారుకాక మానరు. కానీ ఆమె కడిగిన ముత్యంలా వున్నది. ఎవరైనా యింటికి వస్తారని సింగారించుకుని కూర్చున్నదేమో యీవేళ అనుకుంది వనజ.

వనజ సాయంత్రం మళ్ళీ నీళ్ళు పట్టుకుంటూంటే ఆమె తలుపు తెరచుకుని బయటికి వచ్చింది. ఆమెది అందమైన ఆకారం. లేత పసుపురంగు వాయిలు పెద్దపెద్ద పూలు అద్దినది కట్టుకుంది. ఆ చీర మెత్తగా ఆమె వంటిని అదుము తున్నట్లుంది. ఆ లేతరంగు, మెడమీద కాంతిని పరుస్తోంది. చేతులు పైకెత్తి గుమ్మాన్ని పట్టుకుని ఆమె నిలబడితే, పూచిన తంగేడులా వుంది, కాస్సేపటికి ఆమె యింటికి తాళం వేసుకుని పిల్లవాడి చేయిపట్టుకుని మెల్లిగా రోడ్డుమీద నడుస్తూ బయలుదేరింది. రంగుబొమ్మల అడ్వర్టయిజుమెంటు పత్రికలోంచి దిగివచ్చి నడుస్తున్నట్లుంది. ఆమె పెద్దగా సింగారించుకోలేదు. గొప్ప అందగత్తెకాదు. కానీ ఆ హొయలు, పరిశుభ్రత, చీరె కదలికలో వెలువడుతున్నట్లున్న సుగంధ పవనాలు— వనజ కన్నార్పకుండా చూసింది.

ఆ బిందె లోపల పెట్టాక గబగబ స్నానం చేసింది వనజ. తెల్లనిచీరె, సన్న ఎర్రజరీ అంచుది కట్టుకుని, కాటుక దిద్దుకుని, ఎర్రని కుంకుమ పెట్టుకుని, ఇన్ని పూలు తురుము కుంది. పిల్లలువచ్చి చూచి, "అమ్మా-ఇచ్చిపోదామా?" అని అడిగారు, "లేదునాన్నా!" అంటే- "మరి చీరె ఎందుకు కట్టు కున్నావు?" అన్నారు.

"ఊరికేనే" అన్నది వనజ.

కొంచెం ప్రొద్దుపోయాక యింటికి వచ్చిన వనజ వాళ్ళ ఆయనకూడా, "ఎక్కడి కేమిటి పెత్తనాలు వెళ్ళివచ్చావు?" అన్నాడు. ఆమె ముఖం ముడుచుకుని, "ఎక్కడికె లేదు. సాయంత్రం శుభ్రంగా బట్ట కట్టుకోకూడదా?" అన్నది.

"కాదులే. ప్రత్యేకం సింగారించుకుంటేను...." అని అతను అంటోంటే "నా సంతోషం కోసం నేనేదో చేసు కున్నాను" అన్నది.

ఎదురింటి వనిత రోజూ ఉదయంపూట- ఖాళీగానే కూర్చుంటుంది కిటికీలో. మధ్యాహ్నమప్పుడు పోస్టు అందు కోవడానికి వచ్చినప్పుడైనాసరే మాయని చీరె, చెరగని తలతో కనబడుతుంది. ఇంక సాయంత్రాలైతే చెప్పనే అక్క ర్లేదు. రోజుకో బట్టలమిల్లువాళ్ళు అందంగా షోకేసులలో బొమ్మలకి చీరెకట్టి వదిలినట్లు, కొంటుకు, తను నడిచి పోతుం టారు. వనజకికూడా ఆమెను చూసి చూసి తన అలంకరణ మీద శ్రద్ధ ఎక్కువైంది. పిల్లల్ని ఎదురింటి పిల్లవాడిని పిల్చుకు

రమ్మని పంపి అతనికీ, వీళ్ళకీ ఆటల్లో స్నేహం కలిపింది. ఆ పిల్లవాడిని అన్నీ అడగాలని.

ఆమె-ఎదురింటి ఆమెది, ఒకరికోసం చేసుకునే అలంకరణ కాదు అని తేలిపోయింది. అది ఒకనాటి ప్రత్యేక యత్నమూ కాదు. సహజంగానే అలాఅందంగా పూలతీగలా పుట్టినట్లుందామె. మెల్లిగా స్నేహం కలుపుకుని- 'ప్రొద్దున్న పని పాటలు ఎల్లాగవుతాయి? మీ ఇంట్లో నీళ్ళు పట్టుకోనక్కర్లేదా? పనులన్నీ మీ ఆయనే చేస్తారా? మధ్యాహ్నం పూట కాస్సేపు నడుం వాల్చరా? సాయంత్రం వంటపని వుండదా? మీ చీరెలు ఎవరు ఎవరు వుతికి యిస్త్రీ చేస్తారు?" లాంటి ప్రశ్నలు యెన్నోవేసి, జవాబులు తెలుసుకోవాలని ఆలోచన చేసింది. ఏమిటో పట్టలేని కుతూహలం, ఆమె జీవితం చూస్తోంటే విపరీతమైన ఆకర్షణ.

ప్రొద్దున్న బుజాన బిందె ఎత్తుకుంటూ ఎదురింట్లోకి చూసిన వనజకి, బార్లా తెరచిన తలుపులు కనబడ్డాయి. బండిలో సామాను వెళ్ళిపోయింది. రిక్షాలో ఫాను పెట్టుకుని పిల్లవాడు కూర్చున్నాడు. ఆయన యింట్లో యింకేవో సర్దుతున్నట్లున్నాడు.

వనజకి అకారణంగా ఒక కంగారు కలిగింది. "బాబూ ఎక్కడికి వెడుతున్నారు?" అన్నది.

"ఇంకో యింటికి."

"మీ అమ్మగారు ఏరీ?"

"రాత్రే వెళ్ళిపోయింది. అక్కడే పడుకుంది."

"అయ్యో! 'మాయని చెరగు, చెరగని సింగారం మీవి. వాటి రహస్యం ఏమిటో నాకు చెప్పండి' అని అడగకుండానే వెళ్ళిపోయిందామె, అయ్యో!"

ఆ సాయంత్రం ఆరున్నరకి వనజవాళ్ళ ఆయన ఇంటికి వచ్చేటప్పటికి వనజగానీ పిల్లలుగానీ రోజూమల్లే టిప్‌టాప్‌గా తయారై లేరు.

"ఇదేమిటి! ఇల్లాగే వున్నారేం యింకా?" అన్నాడాయన.

వనజ విసుగ్గా, "ఏదో లెద్దురూ! ఇంట్లో వుండేవాళ్ళం ఎల్లా వుంటేనేం?" అన్నది.